క్లుప్తంగా

వాహన తనిఖీలు



బూరాడ జంక్షన్ వద్ద కారు డిక్కీలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ నీలావతి

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట, సంకిలి, బూరాడ జంక్షన్ల వద్ద ఎస్ఐ పి.నీలావతి తమ సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపుల నుంచి వచ్చిన వాహనదారులను ఆపి, వారి వాహన ధ్రువపత్రాలు పరిశీలించడంతో పాటు గంజాయి, కొకైన్, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాల రవాణా జరుగుతున్నదీ లేనిదీ సోదాలు చేశారు. మత్తు పదార్థాల రవాణా చేస్తే కఠిన శిక్షలు అమలు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: పట్టణంలోని అన్ని వార్డుల ప్రజలకు వ్యర్థాల విభజనపై అవగాహన కల్పించనున్నామని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యర్థాల విభజనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ నిమిత్తం వీధుల్లోకి వస్తున్న పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను వేరువేరుగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, ఏఈ కె.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈ లక్ష్మణరావు, తదితరులు

బొబ్బిలిరూరల్: అభివృద్ధి పనుల్లో భాగంగా చేపడుతున్న నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈ లక్ష్మణరావు సూచించారు. మండలంలోని కింతలవానిపేటలో రూ.30 లక్షల నిధులతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చెల్లించాల్సిన చెల్లింపులు నిలిపివేస్తామని, అలాగే ఇదివరకు చెల్లించిన మొత్తాలను కూడా వెనక్కి రాబడతామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈ శ్రీనివాసరావు, పీఆర్ జేఈ రాజశేఖర్ ఉన్నారు.

ఎంపీడీవో పరిశీలన



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలిరూరల్: మండలంలోని ఎం.బూర్జివలస సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సేవా కేంద్రాన్ని ఎంపీడీవో పి.రవికుమార్ గురువారం పరిశీలించారు. ఆధార్ కార్డులోని వివరాల్లో ఏవైనా తప్పులుంటే సరిదిద్దుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రఘువంశీ

బొబ్బిలిరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పిరిడి గ్రామ పీహెచ్‌సీ డాక్టర్ రఘువంశీ సూచించారు. మండలంలోని రంగరాయపురం గ్రామ వెల్‌నెస్ సెంటర్‌లో సీజనల్ వ్యాధులు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయన తెలిపారు. ఆహారం తినేముందు తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు.

ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్

రాజాం సిటీ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తహసీల్దారు ఎస్‌కే రాజు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఈ నెల 9, 10వ తేదీలతో పాటు 23, 24వ తేదీల్లో ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఆయా రోజుల్లో విధులకు గైర్హాజరైన బీఎల్‌వోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధరల దడ



నిత్యావసరాల ధరలు దడ పుట్టిస్తున్నాయి. కార్తీకమాసం వేళ అత్యధికులు శాకాహారుల అవతారమెత్తడంతో కూరగాయల ధరలకు అమాంతం రెక్కలొచ్చాయి. విపరీతంగా పెరిగిన రేట్లు.. సామాన్యులకు ఇప్పుడు చుక్కలు చూపిస్తున్నాయి. మార్కెట్‌కు వెళ్లి ఏది కొందామన్నా రూ.50లకు తక్కువ లేకపోవడం చూసి, ఈ ధరల బాదుడేంట్రా 'బాబూ' అని మొర్రోమంటున్నారు. రూ.500కు కనీసం సంచి నిండా సరుకులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ధరల నియంత్రణ చేపట్టాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

- కూరగాయలపై కార్తీకం ఎఫెక్ట్
- అమాంతం పెరిగిన ధరలు
- ఆందోళనలో కొనుగోలుదారులు
- రూ.500 తీసుకెళ్లినా సంచి నిండడం లేదని ఆవేదన
- ధరల నియంత్రణ చేపట్టాలని వినతి

రాజాం: కూరగాయలపై కార్తీకమాసం ఎఫెక్ట్ పడింది. ఇప్పటికే ధరల నియంత్రణ లేక నిత్యావసర సరుకుల ధరలు రోజుకోమాదిరిగా ఉంటున్నాయి. దీంతో సామాన్యుడు ఏమీ కొనలేని.. తినలేని.. పరిస్థితుల్లో ఉన్నాడు. ఇలాంటి సమయంలో స్థానికంగా లభించే కూరగాయలే ప్రధాన ఆసరాగా నిలిచేవి. అయితే ప్రస్తుతం కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఎక్కువ మంది శాఖాహారం తీసుకోవడం, అయ్యప్ప, శివస్వాములు దీక్షలు చేయడం, అన్నదానాలు జరుగుతుండడంతో కూరగాయలకు బాగా డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో వాటి ధరలు అమాంతం పెరుగుతున్నాయి. రోజు రోజుకూ ఈ ధరలు పెరుగుతూ వస్తుండడంతో వాటిని కొనుగోలు చేసేందుకు సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారు. నచ్చిన కూర వండుకుని, తినాలంటే కష్టమైందని గగ్గోలు పడుతున్నారు.

స్థానిక కూరగాయలకూ డిమాండ్..

రాజాం పట్టణ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా కూరగాయల సాగు జరుగుతోంది. పెనుబాక, బొద్దాం, గార్రాజుచీపురుపల్లి, కొత్తవలస, ఒమ్మి, వంగర, రేగిడి, జాడపేట, బూరాడ, సంకిలి, సంతకవిటి, మల్లయ్యపేట, పుల్లిట, హొంజరాం, సిరిపురం తదితర గ్రామాల్లో నిత్యం కూరగాయల సాగు చేపడుతుంటారు. టమాటా, బెండ, వంగ, చిక్కుడు, బీర, సొర, క్యాబేజీ వంటివి ఇక్కడ అధికంగా పండిస్తుంటారు. ప్రతిరోజూ ఉదయాన్నే రాజాం మార్కెట్‌కు వాటిని తీసుకువస్తుంటారు. మిగిలిన పట్టణ ప్రాంతాల కన్నా ఇక్కడ వాటికి ధర తక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో కార్తీకమాసం రోజుల్లో స్థానికంగా లభించే కూరగాయలు, వాటి ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వాటి ధరలు విపరీతంగా ఉండడంతో వాటిని కూడా ఇప్పుడు కొనుగోలు చేయలేకపోతున్నామని కొనుగోలుదారులు చెబుతున్నారు. నిన్న, మొన్నటివరకు కిలో బీరకాయల ధర రూ.30 ఉండగా, ఇప్పుడు రూ.40 నుంచి రూ.60లకు పెరిగింది. చిక్కుడు, బెండ, క్యాబేజీ, టమాటా తదితర కూరగాయల ధరలు కూడా కిలోకు రూ.10లు నుంచి రూ.20లు అదనంగా పెరిగాయి. ఇప్పుడు ఏ కూరగాయ కిలో కొనుగోలు చేయాలనుకున్నా రూ.40లు, రూ.50లు దాటి చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రానున్న రోజుల్లో వీటి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ధరల నియంత్రణ లేకపోవడం, రైతుబజార్లు సక్రమంగా నిర్వహించకపోవడంతో వ్యాపారులు తమ ఇష్టానుసారంగా విక్రయాలు చేస్తున్నారు.

ఏ కూరగాయ కొనలేకపోతున్నాం..



వారం రోజుల క్రితం వరకు ఉన్న ధరలు ఇప్పుడు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఏ కూరగాయ కొనలేకపోతున్నాం. కూరగాయల ధరలతో పాటు ఆకుకూరల ధరలు కూడా విపరీతంగా ఉన్నాయి.

–నక్క వర్షిణి, బొద్దాం, రాజాం మండలం

రోజుకో ధర



కూరగాయల ధరలు రోజుకో ధర పలుకుతున్నాయి. ముఖ్యంగా రాజాం మార్కెట్‌లో ధరలలో నిలకడ లేదు. తాజా కూరగాయలు కొనుగోలు చేయాలంటే రూ.10 ఎక్కువ చెల్లించాల్సిందే. ఊరిలోకి వచ్చే కూరగాయలకు కూడా అధిక ధర ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

–శింగంవలస లక్ష్మి, గృహిణి, రేగిడి మండలం

అట్టహాసంగా నందెన్న నిమజ్జనోత్సవం



రామభద్రపురంలోని పాందూరు వీధిలో కొన్నిరోజులుగా పూజలందుకుంటున్న నందెన్న నిమజ్జనోత్సవం బుధవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గంగాగౌరీ సమేత ఈశ్వరుని విగ్రహ ఊరేగింపు సందడిగా సాగింది. బిందెల డ్యాన్స్, తప్పెటగుళ్లు, కోలాటం, కోయ నృత్యం, కాళికాశక్తి వేషధారణలతో పాటు తీన్మార్ దప్పులకు మహిళలు వేసిన స్టెప్పులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

- రామభద్రపురం

గుంతలు పూడ్చండి సారూ..



రామభద్రపురం గ్రామం మధ్యలో నుంచి సాలూరు వెళ్లే రోడ్డు సహా రామభద్రపురం-రాజాం రహదారి చాలా అధ్వానంగా తయారయ్యాయి. రోడ్డు పొడవునా అడుగుకో గుంత, గజానికో గొయ్యి ఉండడంతో అటువైపుగా రాకపోకలు సాగించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గర్భిణులను ఆస్పత్రికి తరలించే సమయంలో అష్టకష్టాలు పడుతున్నామని వాపోతున్నారు. రోడ్లు బాగు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని అభ్యర్థిస్తున్నారు. కనీసం గుంతలైనా పూడ్చండి సారూ అని వేడుకుంటున్నారు.

-రామభద్రపురం

ముమ్మరంగా వరి కోతలు



రేగిడి మండల వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో మండలంలోని మొత్తం 39 గ్రామాల్లోనూ కోతలు చకచకా జరిగిపోతున్నాయి. మరోవైపు కోసిన పంటను నూర్పిడి కోసం కల్లాలకు తరలించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

- రేగిడి

లోక రక్షకుడు క్రీస్తు

వంగర: లోక రక్షకుడు క్రీస్తు అని, ఆయనను ఆరాధించిన వారు పరలోకం పొందుతారని శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రారాల విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని శివ్వాం గ్రామంలో క్రీస్తురాజు దేవాలయం నిర్మించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబిలీ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, క్రీస్తు సందేశం చదివి వినిపించారు. ప్రజల పాప పరిహారం నిమిత్తం ఏసుప్రభువు తన రక్తం చిందించారని, ఆయన బోధనలు అనుసరణీయమన్నారు. అనంతరం మత గురువులకు సత్కారం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయిరాల విజయ్‌కుమార్, ఫాదర్‌లు

నిబంధనలు పాటించాలి

రాజాం: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని ఎంఈవో యాగాటి దుర్గారావు సూచించారు. గురువారం స్థానిక పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. పాఠశాలల నిర్వహణ, అనుసరిస్తున్న బోధనా పద్ధతులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పాఠశాలల నిర్వహణ ఉండాలని, విద్యార్థులకు సులభమైన పద్ధతుల్లో బోధన చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు ప్రక్రియపై ఆరాతీశారు. త్వరితగతిన అపార్ నమోదు పూర్తి చేయాలని కోరారు.

మందకొడిగా అపార్ నమోదు..

బాడంగి: మండల వ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు సంబంధించి, చేపడుతున్న అపార్ నమోదు ప్రక్రియ చాలా మందకొడిగా సాగుతోంది. ఆధార్‌కార్డులోని వివరాల ఆధారంగా జరిగే ఈ నమోదుకు ఆధార్ వివరాల్లోని తప్పులు అడ్డంకిగా మారాయి. విద్యార్థులంతా తమ ఆధార్‌కార్డుల్లోని వివరాలు సరిచేసుకున్న తర్వాతనే అపార్ నమోదు కావస్తుండడంతో ఆలస్యమవుతోందని పలువురు చెబుతున్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ



రేగిడి: బూరాడలో కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు



రాజాం సిటీ: రాజాం పట్టణంలో జీఎంఆర్ ఐటీ విద్యార్థుల ర్యాలీ

రాజాం/రాజాం సిటీ/రేగిడి: జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం పురస్కరించుకుని, మండలాల్లో పలుచోట్ల కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులంతా కేన్సర్ ఏవిధంగా వస్తుంది.. దాని బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై చైతన్యం కల్పించారు. ఆహారపు అలవాట్లు సక్రమంగా లేకపోవడం, మద్యపానం, ధూమపానం వల్ల కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకుంటే వ్యాధి నుంచి బయటపడొచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వంగర: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వేమిరెడ్డి సాంబశివరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. రేగిడి మండలంలోని బూరాడ నుంచి సరసనాపల్లి వరకు విద్యుత్ తీగలను తాకుతూ ఉన్న చెట్లకొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

తాగునీటి సరఫరాకూ..

బొబ్బిలి: పట్టణ పరిధిలోని ప్రజలకు శుక్రవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్, డాక్టర్ రెడ్డి రవికుమార్ ఆస్పత్రిల ప్రాంతాల్లోని తాగునీటి పైప్‌లైన్‌ల మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

పక్కాగా ఫీవర్ సర్వే చేయాలి

బాడంగి: పక్కాగా ఫీవర్ సర్వే చేయాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో గురువారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే గ్రామస్తులు సకాలంలో వైద్యసేవలు, తాగునీరు అందేలా చూడాలన్నారు. గ్రామీణులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నీలకంఠేశ్వరయాదవ్



రాజాం సిటీ: బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాజాం ప్రాంతానికి చెందిన ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆయన నియామకం పట్ల పలువురు పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

రాజాం: స్థానిక సర్కిల్ పరిధిలో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ హెచ్చరించారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. నియోజకవర్గ పరిధిలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో వారం రోజుల పాటు చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 81 మద్యంసీసాలు పట్టుకుని, ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

17,784 ఎకరాల్లో ఈ-క్రాప్ సోషల్ ఆడిట్

రేగిడి: మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో 17,784 ఎకరాల్లో ఈ–క్రాప్‌కు సంబంధించిన సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నామని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని వన్నలి, చాటాయవలస, ఉప్పర్నాయుడువలస, వండానపేట తదితర గ్రామాల్లో ఈ–క్రాప్ సోషల్ ఆడిట్‌పై గ్రామసభలు గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సమక్షంలో ఈ–క్రాప్ ఆడిట్ వివరాలు వెల్లడిస్తున్నామని, వీటిలో ఏ తప్పులున్నా చెప్పాలని, సరిచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వన్నలి సర్పంచ్ గార రమణ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న డివిజనల్ డిప్యూటీ సర్వేయరు నారాయణరావు

బొబ్బిలిరూరల్: భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని డివిజనల్ డిప్యూటీ సర్వేయరు నారాయణరావు తెలిపారు. మండలంలోని గున్నతోటవలస గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన ఆయన.. పలువురు రైతులు తమ భూ సమస్యల పరిష్కార నిమిత్తం అందజేసిన వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. గతంలో జరిగిన రీసర్వేలో ఏవైనా తప్పులుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

నీటితీరువా వసూళ్లు వేగవంతం చేయండి



తెర్లాం: మాట్లాడుతున్న తహసీల్దారు హేమంత్‌కుమార్

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో నీటితీరువా వసూళ్లను వేగవంతం చేయాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలతో గురువారం సమావేశమైన ఆయన మండలంలో రూ.18.37 లక్షల నీటితీరువా వసూళ్లు చేయాల్సి ఉండగా, ఇంతవరకు రూ.3.77 లక్షలు వసూళ్లు చేశామని తెలిపారు. నిర్ణీత గడువులోగా నీటితీరువాను రైతుల నుంచి వీఆర్‌వోలు వసూళ్లు చేయాలని ఆదేశించారు. త్వరలో జరిగే సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న రైతులు తప్పనిసరిగా నీటితీరువా బకాయి లేకుండా ఉండాలని, ఇదే విషయాన్ని గ్రామాల్లోని రైతులకు తెలియజేయాలన్నారు. నీటితీరువా వసూళ్లలో నిర్లక్ష్యం వహించే వీఆర్‌వోలపై చర్యలు తీసుకునేందుకు కూడా వెనుకాడేది లేదన్నారు. సమావేశంలో ఉప తహసీల్దారు జి.సత్యనారాయణ, ఆర్ఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బందితో తహసీల్దారు కె.సుధాకర్ గురువారం సమావేశమై, పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో నీటితీరువా వసూళ్లను వేగవంతం చేయాలని తెలిపారు. సమావేశంలో హెచ్‌డీటీ ఆర్.ధనం, మండల సర్వేయరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన



సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి గురువారం పర్యటించారు. జూబ్లీ రోడ్డు, మెయిన్ రోడ్డు సహా శ్వేతా చలపతి స్కూల్, తాండ్రపాపారాయ బొమ్మ, మార్కెట్ రోడ్ల ప్రాంతాలకు వెళ్లిన ఆమె అక్కడి పారిశుధ్య పరిస్థితులను చూసి, అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ ప్రాంతం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. రోడ్లపై విచ్చలవిడిగా పశువులు సంచరిస్తే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. తాండ్రపాపారాయ బొమ్మ వద్ద ఉన్న కాంపక్టర్ బిన్‌ను తొలగించి, అక్కడ సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే డంప్ సైట్లను గుర్తించాలని, కాలువల్లోని సిల్టును తొలగించాలని తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

వంగర: విద్యార్థుల్లో ఎవరికైనా పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం(బర్త్ సర్టిఫికెట్) అవసరమైతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు దిరిశాల ధర్మరాజు గురువారం సూచించారు. ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థుల వివరాల నమోదుకు సంబంధించి, చేపడుతున్న అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదుకు బర్త్ సర్టిఫికెట్ అనివార్యమైందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు సదరు సర్టిఫికెట్ కోసం సచివాలయాలను ఆశ్రయించి, పొందవచ్చని తెలిపారు.

పంటకోత ప్రయోగం



గుళ్లపాడులో వరిపొలంలో పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని గుళ్లపాడు, ఉంగరాడ గ్రామాల్లోని వరి పొలాల్లో పంటకోత ప్రయోగం గురువారం నిర్వహించారు. ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉందని, ఎకరానికి 30 బస్తాల ధాన్యం దిగుబడి వస్తోందని ఏవో జి.మురళీకృష్ణ, మండల ఉప గణాంక అధికారి ఏసుబాబులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బొబ్బిలి: విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బొబ్బిలిలోని దిబ్బల వీధికి చెందిన సుమల దత్తు(26) అనే యువకుడు మృతి చెందినట్లు సీఐ కె.సతీష్‌కుమార్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ఈ నెల 5వ తేదీన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దత్తు బొబ్బిలి మండల పరిధిలోని సంత తోట వద్ద రోడ్డు ప్రమాదానికి గురై, గాయాలపాలైన సంగతి తెలిసిందే. అయితే అప్పుడు చికిత్స నిమిత్తం అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ వైద్యసేవలు అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి బుధవారం తరలించారు. అదేరోజు(బుధవారం) సాయంత్రం 5 గంటలకు చికిత్స పొందుతూ దత్తు మరణించినట్లు పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. మృతుడి సోదరి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పారిశుధ్య పనులు

రాజాం/రేగిడి: మండలాల్లోని పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు గురువారం చేపట్టారు. రోడ్లపై ఉన్న చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు. రాజాం మండలంలోని పెనుబాక గ్రామంలో జరిగిన పారిశుధ్య పనులను జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. అపారిశుధ్యం పేరుకుపోతుండడం కారణంగానే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన గ్రామస్తులకు సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com